


# పరదేశీ కథలు

## - చిట్టేసిద్ధ లలిత



-80 -

## ఎడారిలో ఒక కాంత కథ

**కువైట్ పట్టణానికి** దూరంగా వున్న ఖురేన్ అనే ఏరియాలో కొత్తగా కట్టిన అధునాతన భవంతి అది. ఆ ఏరియాలో అక్కడక్కడా కడుతున్న భవంతులన్నీ కూడా సంపన్నులవే. అందుకే అవి తోట, స్విమ్మింగ్ పూల్ లాంటి అన్ని వసతులతో అందమైన ప్యాలెస్ లను పోలి వున్నాయి. ఇళ్ళముందు పూల పడవల్లాంటి కార్లు రాజసంగా ఆగి వున్నాయి. వాటి మీద దుమ్మూ ధూళి, మరకలు పడకుండా జాగ్రత్తగా కంటికి రెప్పలా చూసుకుంటూ సంరక్షించే డ్రైవర్లు కూడా అక్కడే ఆ చుట్టుపక్కలే వున్నారు.

కువైట్ షేకులకు కార్లంటే చాలా ఇష్టం. కొత్త మోడల్ కార్ మార్కెట్లోకి వచ్చిందంటే వెంటనే పోటీపడి కొనాల్సిందే. వాళ్ళకి అదో ప్రిస్టేజీ సమస్య కూడా. పెట్రోలు ఊటలా భూమి నుండి పెల్లుబికి వస్తున్నంత కాలం వారి విలాసాలకు లోటు లేదు. కొత్తగా కట్టిన ఆ భవంతికి కావలిసిన ఫర్నిచర్ ఇటలీ నుండి తెప్పించారు. రోజ్ వుడ్ తో చేసిన తలుపులన్నీ నగిషీలు చెక్కబడి నిగనిగ లాడుతున్నాయి. కట్టడం పూర్తి అయింది కానీ ఇంకా ఫినిషింగ్ పనులు పూర్తి కాకపోవడంతో ఇంటీరియర్ డెకరేషన్ కంపెనీ నుండి పనివాళ్ళు వచ్చి గుమ్మాలకు, కిటికీలకు కర్టెన్లు కుట్టడానికి కొలతలు తీసుకుంటున్నారు. వాళ్ళ మాటలను బట్టి వాళ్ళు తెలుగు వాళ్ళని అర్థమవుతోంది.

ఆ ఇంట్లో వంటపని చేసే కాంత తెలుగు భాష చెవిని బడగానే సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయింది. అటూ ఇటూ చూసి బాబా, మామా అక్కడ లేరని నిర్ణయించుకుని గబగబా వెళ్ళి వాళ్ళను పలకరించింది.

వాళ్ళు కూడా ఆనందంగా "హా అవును మేము తెలుగు వాళ్ళమే. మాది రాజంపేట" అని చెప్పారు.

వారిలో ఒకడు "ఓమ్మా ఏ ఊరు మనది" అని అడిగాడు.

"మా ఊరు కూడా అక్కడేలే మీ ఊరికి పక్కనే" నవ్వుతా అనింది కాంత.

"అబ్బ చెప్పరాదంటమ్మా మీ ఇంటికి రాములే" అన్నాడతను.

"ఊరుదేముండాదిలే మాట మంచిగుండాల" చెప్పింది. ఆ పక్క నిచ్చెన ఎక్కి కొలతలు తీసుకుంటున్న ఎర్రటి మనిషిని ఓరగా చూస్తూ. అతడు కూడా పని మీద దృష్టి పెట్టకుండా కాంత వైపే చూస్తున్నాడు.

"ఏం పేరు నీది" అడిగింది అతడ్ని..?

"నా పేరు ఇక్బాల్ గాని. నీ పేరేంది పిల్లా" ధైర్యంగా అడిగాడు.

పిల్లా అనేసరికి కిలకిలా నవ్వుతూ "నీ కంటికి పదారేళ్ళ పిల్లలాగా కనబడుతున్నానా నేను" అంటూ మురిసిపోయింది.

"పిల్ల మాదిరే వుండావులే. ఇంతకీ పెళ్ళయిందా లేదా" అడిగాడతను.

"కాలేదు. నువ్వు చేసుకుంటావా" ప్రశ్నించింది గడుసుగా

"ఎందుకు చేసుకోను. నీలాంటి అందగత్తె రావాలే గానీ. సరేగానీ మీ బాబా ఇక్కడికి రాకముందే ఫోన్ నంబర్ ఇయ్యి మాట్లాడుకుందాం" చెప్పాడు ఇక్బాల్.

పేనా తీసుకోని నంబర్ రాసి ఇచ్చింది కాంత. "పొద్దునపూట మా మామాబాబా ఇంట్లో వుండరు. పది గంటలకు చేస్తే ఫ్రీగా మాట్లాడతా" చెప్పింది అతడి చూపుల్లో చిక్కుబడిన చూపుల్ని కష్టంగా విడదీసుకుంటూ.

"ఓమ్మా నాక్కూడా ఎవరన్నా నీలాగా ఎర్రగా బుర్రగా వుండే పిల్ల వుంటే చూడుమా ఈ కొయేట్లో కష్టంతప్ప సుఖంలేదు పాడూలేదు. మాట్లాడుకునేందుకు ఒక తోడులేదు. ముద్దూ ముచ్చటా లేకపోతే పొద్దు ఎట్ట పోతాది. ముందే వయసులో వున్నాం. ఉడుకు రక్తం. తట్టుకోలేకున్నాం." అన్నాడు పక్కనున్న అతను.

"నిజమే. ఈ కొయేట్లో మనోళ్ళతో ఎవరితోనైనా స్నేహం చెయ్యకపోతే పిచ్చి పట్టదా. అట్నే చూస్తాలే అబ్బీ" అనింది కాంత బదులుగా.

"మాటలతో సరిపెడతావా తాగేదానికి మంచి నీళ్ళయినా ఇస్తావా లేదా" అడిగాడు ఇక్బాల్.

"అయ్యో మర్చే పోయాను. నీళ్లేం ఖర్మ పెప్సీలు ఇస్తా తాగండి" అంటూ హడావుడిగా పెప్సీలు తెచ్చి ఇచ్చింది.

"మీ బాబా, మామా రారు గదా" అన్నాడు ఇక్బాల్ అక్కడే వున్న సోఫాలో కూర్చుంటూ.

"ఇప్పుడే రారులే. రెండు గంటలకు వస్తారు. కూర్చోండి అన్నం తిని పోదురు" అంది.

"ఓమ్మో బలే దానివే. ఇదేం మనూరా. తీరికగా కూర్చోని అన్నం తిని వక్కాకు నములా పోయేదానికి. కొయేటోళ్ళు చూస్తే నిన్నూ మమ్మల్నీ చంపి పారేస్తారు" అన్నాడు మరొకతను.

"ఆ భయం ఏమీ లేదులే. మా వోళ్ళు మంచోళ్ళే. అన్నము చేపల కూర వుండాది. ఎంతసేపు తింటారు. పది నిముషాలు వుండండి" అంటా మద్బాక్ (వంట గది) లోకి పోయింది.

"పిల్ల ఉషారుగా వుండాదిరా మామా. నీకు పడిందిలే ఇంక ఎంజాయ్ జేస్కో" అన్నాడు కుమార.

"పిల్లో తల్లో ఎట్ట తెలుస్తాదిరా. ఇంటికాడ మొగుడున్నా గూడా ఇక్కడ పెళ్ళి కాలేదంటార్రా మామా" అన్నాడు ఇక్బాల్.

"అన్నం గూడా పెడతాందంటే మంచి మనసున్నదే రోయ్" అన్నాడు కుమార.

ఇంతలో కాంత రెండు ప్లేట్ల నిండా అన్నం, చేపల కూర తీసుకొచ్చి పెడితే కడుపునిండా తిన్నారిద్దరూ.

అన్ని కొలతలు తీసుకుని మళ్ళా వారానికి కర్టెన్లు బిగించడానికొస్తాం అంటూ వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయారు.

అప్పటినుండీ రోజూ ఉదయాన్నే పది గంటలకు ఫోను చేసుకుని మాట్లాడుకుంటూ ఇక్బాల్ కాంత ఇద్దరూ బాగా దగ్గరయిపోయారు. తరువాత పనిమీద రెండు మూడు సార్లు ఆ యింటికి వచ్చాడు ఇక్బాల్.

మామాబాబా ఆఫీస్ కి వెళ్ళిన టైం కాబట్టి కాసేపు కూర్చుని మాట్లాడి అన్నంతిని వెళ్ళిపోయేవాడు. కానీ మనుషుల్లో స్వార్థం ప్రవేశించి దురాశ పెరిగితే దుర్బుద్ధులు పుడతాయ్. ఇక్బాల్ వచ్చినపుడల్లా బియ్యం, పప్పు, నూనె, చికెన్ లాంటివన్నీ పట్టుకెళ్ళేవాడు. అంతవరకూ పరవాలేదు. కువైట్ వాళ్ళు తిండి విషయంలో ఏమీ అనరు. నాలుగేళ్ళనుండీ పని చేస్తోందని సేఠు, సేఠాని కాంతమీద బాగా నమ్మకం వుంచారు. కావలిసినంత స్వేచ్ఛను కూడా ఇచ్చారు. కానీ ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకుంది కాంత.

"పెళ్ళి చేసుకుని ఇండియాకెళ్ళి సెటిల్ అవుదాం. అందుకు బాగా డబ్బు సంపాదించాలి, ముందుగా ఇండియాలో ఇల్లు కట్టుకోవాలి" అని చెప్పాడు ఇక్బాల్ ఆశకు పునాది వేస్తూ.

"మరి అంత డబ్బు సంపాదించాలంటే ఎన్నేళ్ళు పడుతుంది" అడిగింది కాంత.

"అయిదారేళ్లు ఇద్దరం కష్టపడితే గానీ ఇల్లు అవదు" అన్నాడు ఇక్బాల్.

"అన్నేళ్ళా. నిన్ను పెళ్ళి చేసుకోకుండా నీకు దూరంగా ఎలా వుండగలను" ఏడుపు ముఖం పెట్టింది కాంత.

"మరి ఏం చేద్దాం చెప్పు" అన్నాడు ఇక్బాల్.

"ఏదో ఒకటి ఇక్కడినుండి తొందరగా వెళ్ళిపోయే ఉపాయం చెప్పు" ప్రాధేయపడింది కాంత.

"నేను చెప్పినట్లు వింటావా" సూటిగా చూస్తూ అడిగాడు.

"ఓ తప్పకుండా వింటాను చెప్పు ఇక్బాల్" అంది కాంత.

"మీ మామాకు డైమండ్ నగలు వున్నాయి కదూ అవి తీసుకుని ఈ దేశం విడిచి మన దేశానికి పారిపోయామంటే అంతా సంతోషమే. జీవితం సుఖమే" తన ప్లాన్ వివరించాడు ఇక్బాల్.

ఉలిక్కిపడింది కాంత.

"అమ్మో పట్టుకుంటే ఏమైనా వుందా, ఉరి తీసి ఇక్కడే పూడ్చిపెడతారు" చెప్పింది కాంత భయపడుతూ.
"అందుకే తెలివిగా పని చేయాలి. ఒక్కసారి విమానం ఎక్కామంటే తరువాత ఆ దేవుడు కూడా మనల్ని పట్టుకోలేడు. ఒక్కసారి ఈ పని జరిగిందంటే అంతా సుఖమే. ఆలోచించు" నొక్కి చెప్పాడు ఇక్బాల్.
"అమ్మో అంతపని నేను చెయ్యలేను. ఇది కువైటు. మనది కాని పరాయి దేశం. పట్టుకుంటే తోలు వలిచేస్తారు. వద్దులే ఎందుకు పాడుపనులు. మర్యాదగా కష్టపడి పని చేసుకుని బ్రతుకుదాం" చెప్పింది కాంత.
"నీ ఇష్టం. అయితే మన పెళ్ళి లేట్ అవుతుంది ఎప్పుడో నేను చెప్పలేను." తెగేసి చెప్పాడు ఇక్బాల్.
సందిగ్ధంలో పడింది కాంత. ఇక్బాల్ తో పీకల్లోతు వ్యామోహంలో కూరుకుపోయి వుందామె.
అతడి మాటలకు ఎదురు చెప్పే పరిస్థితి లేదు.
తలచుకుంటేనే భయంగా వుంది. "నాక్కొంచెం టైమివ్వు" బలహీనమైన స్వరంతో చెప్పిందామె.
"అలాగే బాగా ఆలోచించు. మనం ఇండియాలో సంతోషంగా బతకొచ్చు" చెప్పి వెళ్ళిపోయాడు ఇక్బాల్.
ఆ రాత్రి కాంత కంటి మీదకి కునుకు రాలేదు. బయటపడితే ఎంత ప్రమాదమో అనుకుంటేనే వళ్ళు చల్లబడుతోంది. ఇటు బాబా మామా ఎంతో నమ్మకముంచి ఇల్లంతా అప్పగించి డ్యూటీలకు వెళుతున్నారు. నమ్మక ద్రోహం, అందులో దొంగతనం చెయ్యొచ్చా. నలిగిపోతోంది కాంత.
రోజూ ఫోన్ చేసి "ఏమాలోచించావ్" అంటూ వత్తిడి తెస్తున్నాడు ఇక్బాల్.
దిక్కుతోచడం లేదు కాంతకు. ఆఖరికి ఇక్బాల్ మాటల గారడీకే లోబడిపోయిందామె.

ఆరోజు మామా బాబా ఆఫీస్ కి వెళ్ళగానే ఇక్బాల్ వచ్చేసాడు. కాంత తాళాల గుత్తిని చేతబట్టుకుని సిద్ధంగా వుంది. ఇద్దరూ కలిసి సేఫ్ బాక్స్ తెరిచారు. అన్నీ వజ్రాల నగలే. కట్టలుగా పేర్చబడిన డబ్బు కూడా చాలానే వుంది. భయంతో ఆమెకు ఆ ఎసి గదిలో కూడా చెమటలు పడుతున్నాయి. మొత్తం అన్నీ బ్యాగుకు వేసి ఇక్బాల్ చేతికి అందించింది కాంత.
హుషారుగా బ్యాగు తీసుకుని "నేను వెళ్ళి మనకు ఇండియా ఫ్లయిట్ టికెట్లు కొంటాను. నువ్వు రెడీగా వుండు. ఎప్పుడు విమానం దొరికితే అప్పుడు బయట పడదాం" చెప్పి వెళ్ళిపోయాడు ఇక్బాల్.
మామాబాబా వచ్చేటప్పటికి ఇల్లంతా యధాప్రకారం సర్ది ఏమీ తెలియనట్లు వుండిపోయింది కాంత.
రెండు రోజులు గడిచాయి. కానీ అనుకున్నట్లుగా ఇక్బాల్ నుండి ఫోను రాలేదు. ఆమెకు కంగారు ఎక్కువయింది. అతడికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తోంది.
ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు. నిద్ర పోలేక, తిండి తినలేక, పని చెయ్యలేక, భయాన్ని అణచుకోలేక,

కృంగిపోతోంది. ఏమయింది ఇక్బాల్ ఎందుకు ఫోన్ చెయ్యలేదు పలుమార్లు ప్రశ్నించుకుంటోంది.
జవాబు లేదు. భయపడినట్లుగానే నాల్రోజులకు ఏదో పని మీద సేఫ్ బాక్స్ తెరిచిన మామా గట్టిగా కేకలేసి బాబాను పిలిచింది.
ఖాళీగా వున్న పెట్టె ను చూసి "ఎవరు చేసారు దొంగతనం. అంత ధైర్యం ఎవరికి" కోపంతో రంకెలేసాడు బాబా. వెంటనే పోలీసులకు ఫోన్ చేసారు. డ్రైవరు రెండు నెలల నుండీ సెలవులో వున్నాడు. ఇద్దరు పిల్లలూ అమెరికాలో చదువుకుంటున్నారు. ఇంట్లో కాంత తప్ప మరో మనిషి లేదు. పోలీసులు అన్ని ప్రశ్నలూ వేసి కాంతను పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్ళారు. ఎంత అడిగినా, కొట్టినా సరే సరైన జవాబు చెప్పలేదు కాంత.
"నాకు తెలియదు" అనే సమాధానం చెప్పింది.
ఒక నెల రోజులు జైల్లో వుంచి ఇక చేసేదేమీ లేక పాస్పోర్టుపై ఎర్రముద్ర వేసి, చేతులకు బేడీలతో ఇండియా విమానం ఎక్కించారు. అవమానం, బాధ, దు:ఖం , దిగులు ముప్పిరిగొనగా ఆమెకు చనిపోవాలనిపించింది. కానీ ఏదో ఆవేశం హృదయంలో రగులుకోగా బొంబాయిలో ఫ్లయిట్ దిగి అష్టకష్టాలుపడి ఆమె రాజంపేటకు చేరుకుంది.
ఇక్బాల్ అడ్రస్ ను పట్టుకుని ఇంటికి వెళ్ళింది. అక్కడ ఇంట్లో ఇక్బాల్ తన బీబీ, ఇద్దరు బిడ్డలతో నవ్వుకుంటూ పులావ్ తింటున్నాడు. ఇంట్లోకి చొచ్చుకుని పోయి ఇక్బాల్ చెంపను ఛెళ్ళుమనిపించింది కాంత. ఆమె కళ్ళలో నిప్పులు కురుస్తున్నాయి.

❧❧❧

నిర్ఘాంతపోయాడు ఇక్బాల్. అతనే కాదు అతని పెళ్ళాం కూడా.
"ఏయ్ ఎవరు నువ్వు. ఎందుకు మా సాహెబ్ ని కొడుతున్నావ్" అంటూ చెయ్యెత్తింది.
"వీడు చేసిన పనికి కొట్టాలా నరకాలా. అన్నీ అబద్దాలే చెప్పాడు వీడు. పెళ్ళి కాలేదని అబద్ధం చెప్పి నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు. తరువాత దొంగతనానికి నన్ను పురికొల్పి అక్కడ నన్ను ఇరికించి సొత్తంతా ఎత్తుకుని ఇండియాకు పారిపోయి వచ్చాడు. నా దగ్గర పడుకున్నందుకు ఇప్పుడు నేను మూడు నెలల గర్భవతిని. నన్ను ఇన్ని కష్టాలు పెట్టిన వీడిని ఏం చెయ్యాలో చెప్పు. వీడిని చంపెయ్యాలా.. పోలీసులకు అప్పగించి జైల్లో వేయించాలా" ఆవేశంతో అరిచింది కాంత.
అప్పటికే కాంత అరుపులు విని చుట్టుపక్కల జనాలు ఇంటి ముందు పోగయ్యారు. ఇక్బాల్ పెళ్ళాం తెలివైంది "నక్కో బెహెన్ జీ.. నక్కో.. బైఠీయియే. లోగ్ ఆరహీ హే.. ఆప్ హమారా మెహ్మాన్ హై. పానీ పీజియే కానా కాలీజియే." పరిస్థితి అర్థమయి వెంటనే కాళ్ళ బేరానికి వచ్చి కాంత గడ్డం పట్టి బ్రతిమలాడింది ఇక్బాల్ పెళ్ళాం.

ఆమె మాటలతో కాస్త శాంతించింది కాంత.  అందించిన పానీ లోటాను అందుకుని గట గటా తాగి తెప్పరిల్లింది.
ఈ లోపల ఇక్బాల్ కాంత కాళ్ళు పట్టుకుని "ముజే మాఫ్ కీజియే కాంతా . ఆ రోజు విమానం రడీగా వుందని నీకు ఎన్నోసార్లు ఫోన్ చేసాను. ఎన్నిసార్లు చేసినా మీ మామానే ఫోను తీసింది. ఇక ఏం చెయ్యాలో అర్థం కాక అక్కడే వుంటే నేనూ ఇరుక్కుపోతానని భయపడి ఫ్లైట్ ఎక్కి ఇండియా వచ్చేసాను.
నా మీద దయవుంచి ఈ విషయాలు పోలీసులకు చెప్పకు నువ్వు ఇక్కడే నా ఇంట్లోనే మాతో వుండు. నిన్ను నిక్కా చేసుకుని నా బీబీతో సమానంగా మహరాణిలా చూసుకుంటా" ప్రాధేయ పడసాగాడు ఇక్బాల్.
మరొకవైపు ఇక్బాల్ బీబీ సమీరా కూడా గడ్డం పట్టుకుని బ్రతిమలాడుతోంది. ఇక చేసేదేమీ లేక అక్కడే వారితోపాటూ రాజంపేటలో వుండిపోయింది కాంత.
రెండు నెలలు గడిచాక కాంత అన్నలకు విషయం తెలిసి రాజం పేటకు వచ్చి "తురకోడితో వుంటున్నావు నీకు సిగ్గులేదా మర్యాదగా ఇంటికి రా" అని బెదిరించారు.
"నేను రాను. ఇక్బాల్ నన్ను పెళ్ళి చేసుకున్నాడు. ఇంకో మూడ్నెల్లకు బిడ్డను కూడా కనబోతున్నాను. నా జీవితం నా ఇష్టం. వయసొచ్చిన చెల్లికి పెళ్ళి చెయ్యకుండా డబ్బు సంపాదన కోసం కువైట్ కి పంపించినపుడు మీకు సిగ్గనిపించలేదా. మీరు మగ పుట్టక పుట్టలేదా. మళ్ళీ ఈ పక్కకు వస్తే మర్యాదుండదు. మీ చెల్లి చచ్చిందనుకోండి. ఇక జన్మలో మీ దగ్గరికి నేను రాను." అని తిట్టి వాళ్ళను వెనక్కి పంపించింది కాంత.
ఇప్పటికి ఈ సంగతులన్నీ జరిగి పన్నెండేళ్ళయిపోయింది. కాంతకు పుట్టిన పిల్లోడు కూడా పెద్దోడయి స్కూల్ కి వెళ్ళి చదువుకుంటున్నాడు.
కాంత ఇప్పటికీ అక్కడే రాజంపేటలో ఇక్బాల్ కి రెండో బీబీగా జీవితాన్ని గడుపుతోంది.
మా ఊర్లో జనాలు అపుడపుడూ కాంతను గుర్తు చేసుకుని జరిగినదంతా ఒక కథగా చెప్పుకుంటూ వుంటారు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments